సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

ఆదర్శ మహిళ ఇందిరా గాంధీ



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాపురం: ధైర్యవంతమైన నిర్ణయాలతో శత్రుదేశాల గుండెల్లో దివంగత ప్రధాని ఇందిరా గాంధీ రైళ్లు పరిగెత్తించే వారని కాంగ్రెస్ పార్టీ పశ్చిమ సమన్వయకర్త దాకారపు నూకరాజుయాదవ్ అన్నారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా 60వ వార్డు గుల్లపాలెంలోని ఆమె విగ్రహానికి నివాళులర్పించారు. దేశానికి ఆమె చేసిన సేవలను వివరించారు. ఆమెను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణ,ఎర్రయ్య,శ్రీను,బిస్వాల్,హను,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు కండి



మాట్లాడుతున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: ఓటు హక్కు లేని వారు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. పాతగోపాలపట్నం సింహాద్రి, శేషాద్రి, వెంకటాద్రి అపార్ట్‌మెంట్స్‌లో ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఏల ద్వారా ఓటర్ల నమోదు చేయించుకోవాలని నివాసులకు ఆయన సూచించారు. బీఎల్‌ఏలు ఓటర్ వెరిఫికేషన్ చేసినపుడు ఓటర్ లిస్టులో ఉన్న డబుల్ ఎంట్రీలు, దొంగ ఓట్లు గుర్తించాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుణిశెట్టి శ్రీనివాసరావు, పి.ఎస్.రాజు, పసుపురెడ్డి వెంకటరమణ, బల్లంకి వెంకటరావు, ఉష, అపార్ట్‌మెంట్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబీకుల చెంతకు వృద్ధుడు



వైకుంఠరావును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న మమత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుడిని ఆదివారం కుటుంబ సభ్యులకు షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత అప్పగించారు. వైకుంఠరావు అనే వృద్ధుడు ఆశ్రయం లేకపోవడంతో రెండు నెలల కిందట మమత షెల్టర్‌కు తీసుకొచ్చి సపర్యలు చేస్తున్నారు. అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకుని, ఎయిర్‌పోర్టు పోలీసులు సమక్షంలో వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. దీంతో ఆ వృద్ధుడు ఆదివారం షెల్టర్ నుంచి కుటుంబీల చెంతకు చేరాడు. మమతకు వైకుంఠరావు కృతజ్ఞతలు తెలిపారు.

1,011వ రోజుకు ఉక్కు దీక్షలు



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 1,011వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



నాడు: గోపాలపట్నం బాలుర పాఠశాల ప్రధాన ద్వారం



నేడు: పనుల తర్వాత కార్పొరేట్ లుక్‌లో పాఠశాల ముఖ ద్వారం



సర్కారు బడి.. నూతన ఒరవడి

చదువుల బడి బాగుపడింది... నాణ్యమైన విద్య అందుతోంది. కార్పొరేట్ పాఠశాలతో పోటీ పడే పరిస్థితికి చేరుకుంది. సర్కారు బడి అంటే చులకనగా మాట్లాడే పరిస్థితి నుంచి ఇప్పుడు సర్కారు బడే బాగుందంటూ కితాబు అందుకుంటుంది. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టితో శ్రీకారం చుట్టిన నాడు- నేడుతో సాధ్యపడింది.

- నాడు - నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- విద్యా కానుక కింద ఉచితంగా పుస్తకాలు
- పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు

గోపాలపట్నం: రేపటి తరానికి మంచి విద్య అందిస్తే భవిష్యత్తు అభివృద్ధి చెందుతుందని మేధావులు చెప్పిన మాటలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఆలోచించని విధంగా ప్రభుత్వ విద్య బలోపేతానికి కంకణం కట్టుకున్నారు. మౌలిక వసతుల నుంచి పాఠ్యపుస్తకాలు, సబ్జెక్టు ఉపాధ్యాయుల నియామకంతో పాటు జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు అందిస్తున్నారు. సకల వసతులు కల్పించి సర్కారు బడుల రూపు రేఖలు మార్చారు. గోపాలపట్నం ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను పేద విద్యార్థులు అందుకుంటున్నారు. ఉచితంగా ట్యాబ్‌లు ఇవ్వడంతో ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను మరో మారు నెమరు వేసుకోవడం.. సందేహాలను తీర్చుకోవడానికి ఉపయోగిస్తున్నారు.

కార్పొరేట్ లుక్‌తో తరగతి గదులు

గతంలో ప్రభుత్వ పాఠశాల అంటే పాడైన గచ్చులు, టాయిలెట్లు లేని పరిస్థితి ఉండేది. ఇప్పుడు గ్రానైట్ పలకలతో తళతళలాడుతున్నాయి. డిజిటల్ బోర్డులు వచ్చాయి. తాగడానికి, కంచాలు శుభ్రం చేసుకోవడానికి కుళాయిలు ఏర్పాటు చేశారు. అత్యవసరమైతే ఆరు బయటకు వెళ్లే పరిస్థితి లేకుండా మురుగుదొడ్లు నిర్మించారు. మొత్తంగా నాడు- నేడుతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ లుక్ సంతరించుకున్నాయి.



నాడు: బాలికల పాఠశాలలో కుళాయి వద్ద ఇలా..



నేడు: చేతులు శుభ్రం చేసుకోవడానికి ఏర్పాటు చేసిన కుళాయిలు

అప్పటికీ ఇప్పటికీ పోలికే లేదు



పాఠశాలలో 6వ తరగతి నుంచి చదువుతున్నాను. అప్పటికీ ఇప్పటికీ వసతుల పరంగా పోలికే లేదు. చాలా అద్భుతంగా మారిపోయింది. తరగతి గదులు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. సౌకర్యాలన్నీ మెరుగుపడ్డాయి.

-పల్లి అక్షయ, ఇంటర్ మొదటి సంవత్సరం, గోపాలపట్నం

ఇలా మారుతుందనుకోలేదు



మా పాఠశాల రూపు రేఖలు ఈ విధంగా మారుతుందని అనుకోలేదు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన నాడు- నేడు పనులు చాలా బాగున్నాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలను ఈ విధంగా అభివృద్ధి చేసినట్లు చూడలేదు.

- కృపాకర్, 9వ తరగతి, గోపాలపట్నం హైస్కూల్

బోధన చాలా బాగుంది



గతంలో కంటే మా పాఠశాల అన్ని విధాలా చాలా బాగుంది. తరగతి గదులే కాకుండా ఉపాధ్యాయుల సంఖ్య కూడా పెంచారు. వీడియో ద్వారా బోధిస్తున్నారు. దీంతో మాకు బాగా అర్థమవుతోంది.

- వంగలపూడి హర్షవర్ధిని, గోపాలపట్నం

డిజిటల్ విద్య చేరువ



కార్పొరేట్ పాఠశాలల్లో డిజిటల్ చదవులు ఉన్నాయని తెలుసు. అవి ఏవిధంగా ఉంటాయో తెలియదు. ఇపుడు మాకు ఆ చదువులు అందించారు.మంచి అవకాశం.

- చుక్క త్రివిక్రమ్, 9వ తరగతి, గోపాలపట్నం హైస్కూల్

నాడ- నేడులో అభివృద్ధి చేసిన పాఠశాలలు

జీవీఎంసీ 91, 92 వార్డుల్లో పాఠశాలలు **19** | విద్యార్థుల సంఖ్య **5** వేలు

అభివృద్ధి చేసిన పాఠశాలు- నిధులు

గోపాలపట్నం బాలికల పాఠశాల రూ.**65**లక్షలు | బాలుర పాఠశాల రూ.**82**.లక్షలు

రెండో ఫేజ్‌లో..

- బాలుర పాఠశాలలో రూ. **24** లక్షలు
- బాలికల పాఠశాలలో: రూ.**24** లక్షలు
- బాలిక ఉన్నత పాఠశాల ప్లస్2గా అప్‌గ్రేడ్
- పేద విద్యార్థులకు చేరువైన ఇంటర్ విద్య
- ప్రత్యేకంగా ఇంటర్ ఫ్యాకల్టీ నియామకం



బాలికల పాఠశాలలో డిజిటల్ బోధన

బాధితులకు ఆనంద్‌కుమార్ భరోసా

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు చిన్న ములగాడ వద్ద గంగారామ్,ప్రమీల అనే దంపతులు పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే వీరి షాపు ఇటీవల అగ్నిప్రమాదంలో దగ్ధమైంది.దీంతో వారి జీవనం ఇబ్బందికరంగా మారింది.విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆదివారం బాధితుల వద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందేవిధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇంకా ఎటువంటి సాయం కావాలన్నా తనను సంప్రదించవచ్చునని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు, ములగాడ ప్రాంత వాసులు పాల్గొన్నారు.



బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

- ఇదే వార్డు పిలకవానిపాలెంలో ఉంటున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చుక్క వరలక్ష్మికి ఇటీవల కారు ప్రమాదంలో చేతికి తీవ్ర గాయం అయ్యింది. ఆమె ఇంటికి ఆడారి ఆనంద్‌కుమార్ వెళ్లి ఆమె క్షేమ సమాచారం తెలుసుకున్నారు.

సీఎం జగన్‌కే ప్రజల మద్దతు



కొత్తపాలెంలో సీఎం పాలన గురించి వివరిస్తున్న అయితంశెట్టి గోపాలకృష్ణ

గోపాలపట్నం: జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జనం కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు అయితంశెట్టి గోపాలకృష్ణ అన్నారు. 89వ వార్డు కొత్తపాలెంలో ఆదివారం ఆయన ఇంటింటికీ వెళ్లి కరపత్రాల్లో ఉన్న పలు ప్రశ్నలు అడిగి వారు చెప్పిన అభిప్రాయాల్ని సేకరించారు. అనంతరం చిన్న పుస్తకంలో మార్కులు వేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనపై ప్రతీ ఇంటి నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో హామీలు ఏవిధంగా నెరవేర్చకుండా మోసం చేశారో ప్రజలే చెబుతున్నారన్నారు.

కల్యాణ మండపం త్వరితగతిన పూర్తి చేయండి

'పశ్చిమ' సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం: కాపు కల్యాణ మండపం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజక వర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆదేశించారు. జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లోని చేపట్టిన కాపు కల్యాణ మండపం పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కాపుకల్యాణ మండపం కడతామని నమ్మించి మోసం చేసిందన్నారు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. నాణ్యతా లోపాలు లేకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, కాపు సంఘం నాయకులు గండ్రెడ్డి పెదబాబు, కంపర సత్తిబాబు, కంపర కోటేశ్వరరావు, కంచిపాటి నాగరాజు, సాలాపు రమణ, జి. సుబ్రహ్మణ్యం, మేడిది రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభనగర్‌లో కాపు కల్యాణ మండపం పనులు పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

మహిళలు విద్యావంతులు కావాలి

మల్కాపురం: మహిళలు విద్యావంతులు కావాలని మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ గెసిల్లా అన్నారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మల్కాపురం శాఖ గ్రంథాలయంలో మహిళా సాధికారతపై సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు.ఇందిరాగాంధీ వంటి మహిళా నాయకులను అంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మరో అతిథి డాక్టర్ హేమలత మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ధ్యానం, వాకింగ్ వంటివి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అజేయ్‌కుమార్,జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి,వై.అనసూయాదేవి,కార్మిక సంఘ నాయకుడు బి.సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు,విద్యార్థులు

26న రాధాకృష్ణ మహోత్సవం

పెదగంట్యాడ: ఈ నెల 26న నిర్వహించనున్న రాధాకృష్ణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భరిణికాన రామారావు కోరారు. విశాఖ ఉక్కు యాదవ సంఘం ఆధ్వర్యంలో పెదగంట్యాడ సీడబ్ల్యూసీలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా యాదవులందరూ ఈ ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- మల్కాపురం సీఐ జి.డి.బాబు
- విస్తృతంగా వాహనాల తనిఖీ

మల్కాపురం: ట్రాఫిక్ నిబంధనలు ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని మల్కాపురం సీఐ జి.డి. బాబు పలువురు వాహనదారులను హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సీఐ ఇతర సిబ్బందితో కలిసి వాహనాలను విస్తృతంగా తనిఖీ చేశారు. కోరమాండల్, శ్రీహరిపురం కూడళ్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆటోలు,ద్విచక్ర వాహనాలు,కార్లు,భారీ వాహనాలను నిలిపి వాటి పత్రాలను పరిశీలించడం జరిగిందన్నారు.హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారితో పాటు సీట్ బెల్ట్ పెట్టకుండా కార్లు నడిపిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల తనిఖీలో పాల్గొన్న సీఐ జి.డి.బాబు

రూ. 20 కోట్లతో సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి

- ఎంపీ జీవీఎల్ నరసింహారావు
- స్థానిక ఎమ్మెల్యే చీప్ ట్రిక్స్ ప్రదర్శిస్తున్నారని మండిపాటు

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్‌ను రూ.20 కోట్లతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహా రావు అన్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన సింహాచలం రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అండర్ పాస్‌వే ఏవిధంగా జరుగుతుందో అధికారులను అడిగి తెలుసుకున్నారు. చంద్రనగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అలాగే సింహాచలం దేవస్థానానికి అతి చేరువలో ఉన్న రైల్వే స్టేషన్ కావడంతో ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుందని, భక్తులకు సౌకర్యం కోసం ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లకు హాల్ట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన కనీసం ఒక ట్రైన్ అయినా ఆపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్ పాస్‌వే 17 అడుగుల ఎత్తులో 15 అడుగుల వెడల్పుతో నిర్మాణం జరుగుతుందని తెలిపారు. ఈ పాస్‌వే ద్వారా ఫైర్ ఇంజిన్ కూడా వెళ్లేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఈ అండర్ పాస్‌వే నిర్మాణానికి నరేంద్ర మోదీ పేరు పెట్టేందుకు లేఖ రాస్తానని తెలిపారు.



సింహాచలం రైల్వే స్టేషన్ వద్ద అండర్ పాస్‌వే నిర్మించే ప్రాంతంలో పరిశీలిస్తున్న జీవీఎల్

ఎమ్మెల్యేవి చీప్ ట్రిక్స్

గతంలో కూడా స్థానిక ఎమ్మెల్యే అడర్ పాస్‌వేకు తన పేరు పెట్టుకున్నాడని జీవీఎల్ మండిపడ్డారు. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న పనులని చెప్పారు. ఇలాంటి చీప్ ట్రిక్స్‌కు చెక్ పెట్టే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ పేరు పెట్టిస్తామన్నారు. చంద్రనగర్, గోపాలపట్నం వెళ్లేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ బ్రిడ్జి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పశ్చిమ కన్వీనర్ దాడి పురుషోత్తమ రమేష్, బాలాజీశ్వరరావు, వలిరెడ్డి శ్రీనివాసరావు, జి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోపాలపట్నంలో బిగ్ స్క్రీన్

గోపాలపట్నం: గోపాలపట్నం సుకన్య సినిమాహాలు వద్ద వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ సౌజన్యంతో బిగ్ స్క్రీన్‌పై ఇండియా ఆస్ట్రేలియా ఫైనల్ మ్యాచ్‌ను ప్రదర్శించారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌ను చాలా మంది ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, గునిశెట్టి శ్రీనివాసరావు, అయితంశెట్టి శ్రీనివాసరావు వీక్షించారు.

ఉచితంగా తినుబండారాలు

క్రికెట్‌ను చూసి ఆనందించడమే కాకుండా మ్యాచ్‌చూస్తూ జిహ్వచాపల్యాన్ని తీర్చుకునే విధంగా తినుబండారాలు ఉచితంగా ఏర్పాటుచేశారు. ఈ ఏర్పాట్లు చేసిన ఆడారి ఆనంద్ కుమార్‌ను అంతా అభినందించారు.



బిగ్ స్క్రీన్‌లో ఇండియా ఆస్ట్రేలియా మ్యాచ్



బిగ్ స్క్రీన్‌లో క్రికెట్ చూస్తున్న బెహరా భాస్కరరావు తదితరులు

నాక్ ర్యాంక్‌పై మాజీ వీసీల హర్షం

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో నాక్ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానాన్ని సాధించడంపై వైజాగ్ వైస్ చాన్సలర్స్ ఫోరం హర్షం వ్యక్తం చేసింది. ఆదివారం ఉదయం ఏయూ అకడమిక్ సెనేట్ మందిరంలో ఫోరం ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ దేశంలోనే టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఏయూను తీర్చిదిద్దారన్నారు. ఏ ప్లస్ ప్లస్ లభించడం కంటే 3.74 సీజీపీఏ సాధించడం ఎంతో కష్టతరమని చెప్పారు. ఏయూ మాజీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ నేడు ఏయూ ఒక అమూల్య వజ్రంగా మారిందన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య నిరుపమ రాణి మాట్లాడుతూ మానవతా విలువలను మరింతగా విద్యలో అంతర్భాగం చేయాలని సూచించారు. ఆచార్య వి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన వర్సిటీ భూములను వీసీ ప్రసాదరెడ్డి కాపాడడం ప్రశంసనీయమన్నారు. వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సహకారం, తోడ్పాటుతో ఏయూ సమగ్ర అభివృద్ధి సాధ్యపడిందన్నారు. ఇందుకు సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో పి.డి.ఎస్.శ్రీనివాస్, ఆచార్య గంగాధరరావు, ఆచార్య జె.వి.ప్రభాకరరావు, పూర్వ ఉపకులపతులు ఆచార్య వై.సత్యనారాయణ, ఆచార్య ఆర్.సుదర్శనరావు, ఆచార్య జగన్నాథరావు, ఆచార్య వెంకట సుబ్బయ్య, ఓఎస్డీ వి.కృష్ణమోహన్ పాల్గొన్నారు.